నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | MEDAK

రుణమాఫీ కోసం ఎదురుచూపు

పండుగ వస్తున్నది...ఎట్లా అని అన్నదాతల దిగాలు..

- రుణమాఫీ అవుతుందా..? లేదా..? అని రైతుల్లో ఆందోళన
- రెండు లక్షల్లోపు రుణమాఫీ కానీ రైతులెందరో...
- వారంతా కుటుంబ నిర్ధారణ కాక ఎదురు చూస్తున్నారు..
- రుణమాఫీ కటాఫ్ తేదీకి రుణమాఫీ అయినా ఇవ్వని బ్యాంకులు
- రెన్యువల్ టైం దాటుతుండడంతో రైతుల్లో టెన్షన్
- అప్పులు తెచ్చి రుణాలు రెన్యువల్ చేస్తున్న రైతులు
- నేడు నంగునూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా
- హాజరుకానున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట,సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రూ.రెండు లక్షల రుణమాఫీ మాకెందుకు కాలేదని ఉమ్మడి జిల్లాలోని రైతులు ఎదురుచూస్తున్నారు. మూడు విడతల్లో మాఫీ అవుతుంది అనుకున్నాం. కానీ, ఏ విడతలోనూ మాఫీ కాలేదు. బతుకమ్మ, దసరా పండుగలు వస్తున్నాయి. పండుగకు పస్తులేనా..? ఇక మాకు రుణమాఫీ అవుతుందా..? కాదా..? అనే అయోమయంలో రైతులు ఉన్నారు. రూ. రెండు లక్షలపైన ఉన్న వారి విషయంలో ప్రభుత్వం ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదు. ఒక వైపు ప్రభుత్వం కటాఫ్ పెట్టిన తేదీకి 9 నెలలు దాటుతున్నది. సకాలంలో రుణాలు రెన్యువల్ చేయకపోతే బ్యాంకులు డిఫాల్ట్ కింద జమ చేస్తాయి. ఏం చేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. రుణమాఫీ చేయాలని రైతులు వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రెండు లక్షల రుణమాఫీ కానీ రైతులతో కలిసి ధర్నా చేపడుతున్నారు. కార్యక్రమానికి మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు హాజరుకానున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల వివరాలను బీఆర్ఎస్ కార్యకర్తలు సేకరించారు. వాటినన్నింటినీ ఒక నివేదిక రూపంలో తయారు చేశారు. రైతుల పూర్తి వివరాలను అందులో పొందుపర్చారు.

రైతులకు కొత్త సమస్యలు

రైతులు ఆయా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు ఏడాదిలోగా రెన్యువల్ చేసుకోవాలి. కానీ ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేయకపోవడంతో రుణాలు రెన్యువల్ చేయడంలో రైతులు ఆయోమయంలో ఉన్నారు. దీంతో రైతులకు అటు రుణమాఫీ కాక, అటు రుణాలు రెన్యువల్ కాక అవస్థలు పడుతున్నారు. కొంతమంది రైతులు బయట వడ్డీలకు తీసుకొచ్చి రుణాలు రెన్యువల్ చేయించుకుంటున్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేయకపోతే అసలు, వడ్డీ కలిపి తడిసిమోపెడవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రుణమాఫీకి అర్హత ఉన్నా కాలేదు..

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రైతులు పంట రుణమాఫీకి అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు. ఇటీవల గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఇంటి పేర్లలో దొర్లిన తప్పుల వివరాలను సేకరిస్తున్నారు. మరి ఒకే కుటుంబంలో రెండు లక్షలపైన ఉన్న రైతులు వివరాలను ఎందుకు సేకరించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. రెండు లక్షలకు పైన ఉన్న కుటుంబ సభ్యులది వ్యవసాయ శాఖ పోల్డర్‌లో కుటుంబ నిర్ధారణ కావల్సి ఉంది అని వస్తుంది. మరి ఈ రైతుల పరిస్థితి ఏంటి ..? దీనిపై ప్రభుత్వం ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదు. రైతులకు సకాలంలో బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు పనులు విడిచి రోజూ బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెకొంది. ఒకవైపు రైతులకు మాఫీ చేసిన పంట రుణాలు ఇవ్వడంలోనూ బ్యాంకు అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. మరోవైపు కొత్త రుణాలను ఇవ్వడం లేదు. కొత్తగా రుణాలు పొందాలంటే రైతులు తీసుకునే బ్యాంకు పరిధిలోని అన్ని బ్యాంకుల నుంచి నోడ్యూ సర్టిఫికెట్ తీసుకురావల్సి ఉంటుంది. రైతులు బ్యాంకుల వద్దకు వెళితే అధికారులు రేపుమాపు అంటూ తిప్పుతున్నారు.



రేషన్‌కార్డు లింక్ పెట్టిండ్రు..

నాకు బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.1.50 లక్షల క్రాప్ లోన్ ఉంది. గతేడాది లోన్ రెన్యువల్ చేసిన. కానీ, రుణమాఫీ లిస్ట్‌లో నాపేరు రాలేదు. ఇదే విషయంపై ఏఈవోను అడిగితే ఎందుకు రాలేదంటే నాకు, మానాన్నకు ఒకటే రేషన్ కార్డు ఉండడంతో రాలేదన్నారు. మానాన్నకు ఎస్‌బీఐ ఏడీబీలో పంట లోన్ ఉండటం వల్ల పేరు లిస్ట్‌లో రాలేదన్నారు. రూ.2 లక్షలకు పైన ఉన్న మొత్తం కట్టమంటే కడతానంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. కట్ట వద్దన్నారు. బ్యాంకర్లకు అడిగితే మాకు ఏం తెలియదంటున్నారు.

-శ్రీనివాస్, రైతు, సిద్దిపేట

ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ తీరు..

సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వం మూడు విడతలుగా రుణమాఫీ చేసింది. మూడు విడతలు కలిపి 1,02, 323 మంది రైతుల ఖాతాల్లో రూ.843.05 కోట్లు జమ చేసింది. ఇంకా లక్ష మంది రైతులు ఉంటారని అంచనా. మెదక్ జిల్లాలో మూడు విడతలుగా 87, 46 2 మంది రైతులకు రూ.640.87 కోట్లు మాఫీ జరిగింది. ఇంకా 40 శాతం మందికి రుణమాఫీ కావాల్సి ఉంది. సంగారెడ్డి జిల్లాలో మూడు దశల్లో కలిపి 98,251 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.849. 45 కోట్లు జమ చేసింది. ఈ జిల్లాలో సైతం 50శాతం వరకు రుణమాఫీ కాలేదు.

రెండు లక్షల పైన లోన్ ఉన్నది..

నాకు మూడెకరాల పొలం ఉంది. దానిపై ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంక్‌లో రూ.90వేలు పంట లోన్ తీసుకున్న. ఇప్పుడు రూ. 2.05 లక్షలు అయ్యింది. నాకు రుణమాఫీ కాలేదు. రూ.రెండు లక్షల కంటే ఎక్కువ లోన్ ఉందని రుణమాఫీ కాలేదట. మీది పైసలు కడుతానని చెప్పినా బ్యాంక్‌లో సార్లు మాకు ఎం తెలువదంటున్నారు. షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలి.

-బత్తుల నారాయణ,రైతు, గోపులాపూర్, నారాయణరావు పేట మండలం

మాది రుణం మాఫీ కాలేదు..

నాకు నాలుగెకరాల భూమి ఉన్నది. ఎవసం కోసం 2018 నవంబర్‌లో లక్షాయాభై వేల రూపాయలు అప్పు తీసుకున్న. ఏటా వడ్డీ కడుతున్న. అయినా నాకు మాఫీ గాలేదు. ఎందుకు గాలేదు అని కెనరా బ్యాంక్ మేనేజర్‌ను అడిగితే మేం లిస్టు పంపినం. మాదగ్గర ఏమిలేదని అన్నరు. మల్ల అగ్రికల్చర్ ఆఫీసుకుపోయి మాఫీ ఎందుకు చెయ్యలేదని అడిగితే బ్యాంకునుంచి స్టేట్‌మెంట్ తీసుకురమ్మని సెప్పిండ్రు. ఇప్పటికి రెండుమార్లు బ్యాంకుకు, అగ్రికల్చర్ ఆఫీసుల చుట్టూ తిరుగుడైంది.

-రావుల చంద్రారెడ్డి, రైతు, పాట్లపల్లి

కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, పోలీసుల వైఖరిని నిరసిస్తూ. నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఉద్రిక్తతల మధ్య కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

- ప్రొటోకాల్ విషయంపై సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఇరువర్గాల మధ్య వివాదం
- పోటాపోటీగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకుల నినాదాలు
- అర్ధంతరంగా ముగించుకుని వెళ్లిన మంత్రి కొండా సురేఖ

దుబ్బాక, సెప్టెంబర్ 26: సిద్దిపేట జిల్లా దుబ్బాకలో గురువారం ప్రభుత్వం నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతల మధ్య కొనసాగింది. సభావేదికపై పాటించాల్సిన ప్రొటోకాల్ విషయంపై బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకుండా కొందరు కాంగ్రెస్ నాయకులు సభావేదిక పైకి రావడంతో గొడవకు దారితీసింది. దుబ్బాక లోని రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతోపాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు. మంత్రి సురేఖకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంత్రికి దుబ్బాక చేనేతల నూలు దండతో సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని అధికారులు సభావేదికపైకి ఆహ్వానించడంతో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించాలని, ఇది పార్టీ కార్యక్రమం కాదని నిర్వాహకులకు సూచించారు. సభా వేదికపై నుంచి శ్రీనివాస్‌రెడ్డి వెళ్లకపోతే బీఆర్ఎస్ నాయకులు సైతం వస్తారని సూచించారు. ఈ క్రమంలో వేదికపైనే ఉన్న కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు హోరాహోరీగా నినాదాలు చేశారు. సభా ప్రాంగణం వద్ద తోపులాట జరిగింది. వీరితో పాటు బీజేపీ శ్రేణులు సైతం నినాదాలు చేయడంతో కార్యక్రమం రసాభాసగా మారింది. ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో మంత్రి సురేఖ ఒకరిద్దరు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి అర్ధంతరంగా వెళ్లిపోయింది. సభ ప్రాంగణం ఎదుట నాయకుల నినాదాలు, తోపులాటలతో కార్యక్రమానికి వచ్చిన లబ్ధిదారులు ఒకింత భయాందోళనకు గురయ్యారు. ఫంక్షన్ హాల్‌లోకి కేవలం లబ్ధిదారులకు మాత్రం ప్రవేశం అంటూ పోలీసులు కాంగ్రెస్ నాయకులను పంపించారు. బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులను సభలోకి పంపకుండా అడ్డుకున్నారు. మీడియా వారిని సైతం అడ్డుకుని అత్యుత్సాహం చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పేదింటి ఆడపిల్లల పెండ్లికి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ఎంతో ప్రయోజనకరంగా నిలిచిందని, రాబోయే రోజుల్లో ఈ పథకాన్ని పెంచి ఇస్తామని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం మహిళలకు అదృష్టంగా మారిందని పేర్కొన్నారు. దుబ్బాక చేనేతలకు అండగా ఉంటానని, చేనేత కార్మికులకు ఉపాధి మార్గాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కల్యాణలక్ష్మి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ సమావేశంగా నిర్వహించారంటూ లబ్ధిదారులు మండిపడ్డారు.

పాటోకాల్ పాటించకుండా సభావేదికపైకి వచ్చిన దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో వాగ్వాదం

మెదక్‌ను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలి

- పదినెలల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశాం
- మెదక్ జిల్లాకు రూ.12 వేల కోట్ల నిధులు
- త్వరలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ
- త్వరలో పంట నష్టం నిధులు మంజూరు
- మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

మెదక్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): మెదక్‌ను ఎకో టూరిజం, టెంపుల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, పది నెలల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశామని మంత్రి కొండా సురేఖ అన్నారు. మెదక్ కలెక్టరేట్‌లో గురువారం మెదక్ జిల్లా అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాకు అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం రూ.12 వేల కోట్లు అందించామన్నారు. త్వరలో రేషన్, ఆరోగ్య తరహాలో డిజిటల్ కార్డులు అందించాలని ప్రభుత్వ నిర్ణయించిందని పేర్కొన్నారు. రైతులకు పంట నష్టం నిధులు త్వరలో అందిస్తామన్నారు. జిల్లాను అభివృద్ధి దిశగా తీర్చిదిద్దాలని, ప్రజా సమస్యలు పరిష్కరించిన అధికారులను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. నూతన మెడికల్ కాలేజీలో అన్ని వసతులు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాలకు న్యాయం చేయాలని, ధాన్యం కొనుగోలులో సరైన పద్ధతులు పాటించాలన్నారు. ఏడుపాయల్లో రెగ్యులర్ ఈవోను నియమించాలని మంత్రిని కోరారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ హరితహారంలో మొక్కలను సరిగా పెంచాలని, వడియారం అటవీని టూరిస్ట్ ప్రదేశంగా అభివృద్ధి చేయాలని, నర్సాపూర్ ప్రాంతంలో కోతులు అడవి దాటకుండా పండ్ల చెట్లను పెంచాలని, రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేయాలన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ రైతులకు కరెంటు సమస్యలు పరిష్కరించాలని, ఏడుపాయల జాతరను రూ. వంద కోట్లతో ఎకో టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీకి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పీహెచ్‌సీ సబ్ సెంటర్లకు వేయాన్ని పెంచాలన్నారు. చేగుంటలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు పంటనష్టం కాకుండా చూడాలని, ధరణిలో పెండింగులో ఉన్న కేసులు పరిష్కరించాలని కోరారు.

మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

జేఎన్‌టీయూలో మెస్ నిర్వహణ అధ్వానం

బాలికల వసతి గృహంలో వంట మాసాలను పరిశీలిస్తున్న ఆర్డీవో పాండు, తహసీల్దార్ ఈశ్వరీరాణి

చౌటకూర్, సెప్టెంబరు 26: సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహల్లో మెస్ నిర్వహణ అధ్వానంగా తయారైంది. రెండు నెలల క్రితం సాంబారులో ఎలుక పడి వివాదాస్పదమైనప్పటికీ మెస్‌ల నిర్వహణ మాత్రం మారడం లేదు. గురువారం అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, చౌటకూర్ తహసీల్దార్ ఈశ్వరీరాణి, ఆర్ఐ నాగరాజు వంట తయారు చేసే సమయంలో బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గది ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, వంట గది నుంచి మురుగు పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడాన్ని పరిశీలించారు. వంటలకు ఉపయోగించే నూనె, కారం, వెల్లుల్లి, పసుపు, ఇతర మాసాలలు నాణ్యత లేకపోవడాన్ని గమనించారు. పెరుగు ప్యాకెట్లను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచడంతో అవి గడ్డకట్టాయి. వంట పాత్రలు శుభ్రం చేసే గది నుంచి మురుగు బయటకు వెళ్లేందుకు పైప్‌లైన్ సక్రమంగా లేకపోవడం, మ్యాన్‌హోలు సైతం చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధం వ్యాపిస్తున్నది. ఇలాగైతే విద్యార్థులు భోజనం ఎలా చేస్తారంటూ ఆర్డీవో పాండు, తహసీల్దార్ ఈశ్వరీరాణి వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో వంటలు ఇలాగే వండుకుని తింటారా అంటూ వారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు అందుబాటులో లేరు. ఆర్డీవో పాండు ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి వారం రోజుల్లోగా వసతి గృహలను శుభ్రం చేయాలని ఆదేశించారు. వసతి గృహలను శుభ్రంగా ఉంచని సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని, వినినిపక్షంలో విధుల నుంచి తొలిగించాలన్నారు.

మురుగు నిల్వతో దుర్గంధంగా మారిన వసతిగృహం ఆవరణ

వీరవనిత చాకలి ఐలమ్మ

అటవీ, దేవాదాయ, ధర్మాదాయ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ

చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మెదక్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని మంత్రి కొండా సురేఖ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర మొత్తం త్యాగధనుల అమరత్వమేనని, ఆ మహనీయుల స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రశ్నించేతత్వం అలవడిందన్నారు. ఆమె స్ఫూర్తిని భవిష్యత్తుతరాలకు అందించాలనే సంకల్పంతో కోఠిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టామన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, యాదవరెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి మొక్కనూ రక్షించాలి

వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలని అటవీ, దేవాదాయ, ధర్మాదాయ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. గురువారం మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన మహోత్సవంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నారు. పచ్చటి మొక్కలతో భవిష్యత్తు తరాలకు భరోసా వస్తుందన్నారు.

ఫార్మాసిటీపై పోరుబాట

- ప్రతినబూనిన భూ బాధితులు
- మద్దతు పలికిన పర్యావరణ వేత్తలు

జహీరాబాద్, సెప్టెంబర్ 26 : ఫార్మాసిటీపై పోరుబాటకు మూడు గ్రామాలకు చెందిన భూ బాధితులు ప్రతిన బూనారు. వారికి పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, పర్యావరణ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి మద్దతు పలికారు. గురువారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో ఫార్మాసిటీ భూబాధితులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం పర్యావరణ అనుమతులు, గ్రామ సభలు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా సర్వేలు చేపట్టి భూములు లాక్కోని రైతులను రోడ్డుపాలు చేయడం సరికాదన్నారు. ఫార్మాసిటీతో ఆయా గ్రామాల పరిధిలో గాలి, నీరు, నేలా అన్నీ కలుషితమైపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీ నుంచి వెలుబడే వ్యర్థాలతో ఉమ్మడి జిల్లాతోపాటు జంటనగరవాసులకు తాగు, సాగుకు జీవనాధారమైన మం జీరా నది (సింగూర్ ప్రాజెక్టు)కాలుషితం కాబోతుందన్నారు. ప్రజలను ఇబ్బందులు గురిచేసే ఫార్మాసిటీని అడ్డుకోవాలని, శాంతియుతంగా పోరాటం చేయాలన్నారు.

ప్రాణాలైన ఇస్తాం..ఫార్మాసిటీకి భూములు మాత్రం ఇవ్వం

ప్రాణాలైన ఇస్తాం. కానీ, మూడు పంటలు పండే సారవంతమైన భూములను ఫార్మాసిటీకి మాత్రం ఇవ్వమని భూ బాధితులు పర్యావరణ వేత్తలతో కన్నీరు పెట్టుకున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఫార్మాసిటీతో శాశ్వతంగా భూములను కోల్పోవడంతో తమ జీవితాలు రోడ్డు పాలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీని ఏర్పాటు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు పోరాటం చేస్తామని భూబాధితులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామ నాయకులు రవీందర్, సుభాశ్ గుప్తా, రవికుమార్, శివరాజ్, నాగన్న, మారుతీయాదవ్, ఓంకర్ యాదవ్, శివరాజ్, శ్రీపాతి, పూండికూర రవికుమార్, రాజుగౌడ్, ఎల్లారెడ్డి, సునీల్, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో మాట్లాడుతున్న పర్యావరణ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి

సింగూరుకు వరద



గేట్లు ఎత్తడంతో దిగువకు వెళుతున్న వరద

పుల్కల్, సెప్టెంబర్ 26: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద మరింతగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. రోజురోజుకూ వరద పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఇన్‌ఫ్లో 14,563 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 19,107 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వ 29.827 టీఎంసీలు ఉందని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టులోకి వరద వస్తున్నందున గొర్లకాపరులు, మత్స్యకారులు నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు.

ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపుతున్న కాంగ్రెస్ నేతలు

అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్, సెప్టెంబర్ 26: సంగారెడ్డి జిల్లా అందోల్‌లో కాంగ్రెస్ నాయకులు ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపుతున్నారని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. గురువారం టేక్మాల్‌లో కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి జోగిపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్నారని, మొన్న అల్లాదుర్గంలో బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ రెడ్డిపై దాడిచేశారని,...ఇప్పుడు టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై అకారణంగా దాడికి తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యశ్వంత్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని చంటి క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు. టేక్మాల్ సొసైటీలో చైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతుండగా కాంగ్రెస్ నాయకులు వచ్చి ఉద్దేశపూర్వకంగా దాడి చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, ప్రతిఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షుడు వీరప్ప, నాయకులు సాయికుమార్, వెంకటేశం, సద్దన్న, రవి, భాస్కర్, దుర్గారెడ్డి, సలీం, రాజుయాదవ్, గోవింద్ చారి, మల్లేశం, ధనుంజయ, బన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

యశ్వంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

జల దిగ్బంధంలో దుర్గామాత ఆలయం

ఆలయం ఎదుట నుంచి ప్రవహిస్తున్న మంజీరా

పాపన్నపేట, సెప్టెంబర్ 26: ఏడుపాయల వన దుర్గామాత ఆలయం జల దిగ్బంధంలోనే ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు సింగూర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. రెండురోజులుగా సింగూర్ ప్రాజెక్టు రెండు గేట్ల నుంచి సుమారు 20వేల క్యూసెక్కుల నీరు ఘనపూర్ ఆనకట్ట వైపు, అమ్మవారి ఆలయం మీదుగా పరవళ్లు తొక్కుతున్నది. ఈ ప్రవాహం వల్ల మూడు రోజులుగా వన దుర్గామాత ఆలయాన్ని మూసివేశారు. కేవలం ఉదయం మాత్రమే పూజారులు ఆలయంలోకి వెళ్లి పూజలు నిర్వహించి ఆలయాన్ని మూసి వేస్తున్నారు. భక్తులు ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకోవడం కోసం రాజగో